# అపశృతులు

నాపదో ఏటే అమ్మ చనిపోయింది.నాన్న దిగులుతో మంచం పట్టి లేవలేని పరిస్థితి! అన్ని పన్లూ నేనే చెయ్యాలి! ఒకవైపు స్కూలు... చదువు! మరోవైపు ఇంట్లో పని!

గొడ్డుగోదావున్న ఇల్లాయె?. వాటికి కుడితి పెట్టాలి. గడ్డి వెయ్యాలి... పాలు పితకటం... గొడ్లచావడి శుభ్రం చేయటం ఇవన్నీ తప్పని తప్పించుకోలేని పన్లు.

పాలు కావలసినవారు ఇంటికొచ్చే పోయించుకెడతారు. ఇంటింటికెవెళ్లి పాలు పోసి వచ్చే పనైనా తప్పింది. ఇంటిపనికి చదువుకు పొంతన కుదరటంలేదు. అందునా చదువుతోంది టెన్తాయె? మంచి మార్కులతో ర్యాంకు తెచ్చుకోవాలనే ఆరాటం నన్ను వేధిస్తోంది.

తండ్రికి వైద్యంతో తగ్గే జబ్బు కాదని తెగేసి చెపాపడు వైద్యుడు. దిగులుకు మందేముంటుందన్నాడు. అమ్మ పోయిందనే దిగులు నాన్నను మంచాన పడేసింది. మంచంలో పడుకుని ఎప్పుడూ తన్లో తాను మాట్లాడుకోవటం... నవ్వుకోవటం చూస్తుంటే... ఎక్కువరోజులు బ్రతకడేమోనే భయం నన్ను కలచివేస్తోంది.

అమ్మ చనిపోయి నాన్న మంచంలో వుంటే ఇరుగుపొరుగు వచ్చి పలుకరించి సానుభూతి చూపారేగానీ బంధువన్న వాళ్లెవరూ తిరిగి చూడలేదు. నాన్నకు బోలెడు ఆస్తి వున్నా బంధువులెవరికీ ఆర్థికంగ సాయం చేయడని కోపం.!. ఇస్తే తిరిగిపైసా తిరిగిరాదని నాన్న నమ్మకం!

నాకు బుద్ధి తెల్సిన నాటి నుండి మా ఇంటికి ఒకర్రోజైనా చుట్టాలమంటూ వచ్చి రెండు పూటలు వుండి తినిపోవటం ఎరగను.

తల్లిపోయినపుడు నా చేతే తలకొరివి పెట్టించాడు నాన్న!. కొడుకునైనా కూతురినైనా తెలిసీ తెలియని వయసులో నాన్న ఎలాచెప్తే అలా చేశాను.

మా ఇంట్లో మూడు వాటాల్లో, మధ్యన మేంవుంటాం. అటు భాగం ఇటు భాగం అద్దెకిచ్చాం! పక్కింటి ఆంటీలు తరచువచ్చి ఇంటి పనుల్లో నాకు సాయపడుతూండేవాళ్లు.

నేను పుష్పవతినైన సమయాన కూడా బంధువులెవరికీ తెలీపర్చలేదు. తెల్సినా వారు రారు కనుక వీధిలో ఆడంగులంతా వచ్చి కార్యం వెళ్ల తీశారు.

మేం బాగా డబ్బున్నవాళ్లం ! బంగారం వెండి వస్తువులు తాకట్టుపెట్టుకుని నాన్న అప్పులిస్తూండటం నాకు తెల్సు! ప్రాంసరీ నోటు మీద ఎవ్వరికీ అప్పివ్వడు. లిటిగేషన్ వస్తే కోర్టు చుట్టూ ఎవరు తిరుగుతారని అంటావుంటాడు.

మాకు యాభై ఎకరాల సుక్షేత్రమైన మాగాణీ పొలంవుంది. ఏటా ఇంట్లో అవసరాలకు ఓ పాతిక బస్తాలిస్తాల వడ్లు వుంచుకుని మిగితావి మార్కెట్లో మంచి ధర పలుకుతుంది అన్నప్పుడు అమ్మేసి డబ్బు చేస్తూంటాడు.

ఇంట్లో ఇనప్పెట్టె నిండా నోట్లకట్టలు.. బంగారు నగలు... వెండి వస్తువులే!. తాకట్టుపెట్టినవాళ్లు అప్పుతీర్చి వాళ్ల సొత్తును విడిపించుకు వెళ్లినవారి సంఖ్య బహుస్వల్పం! వేళ్లమీద లెక్కించవచ్చు!.

బైట ఎక్కడా చెలామణీలో లేని వెండి రూపాయి బిళ్లలు మా ఇనప్పెట్టెలో వుండటం నేను చాలాసార్లు చూశాను.

పొలం పని చూచుకోవటానికి దొడ్లో కొష్ఠంలో పనిచూడటానికి పాలేరున్నాడు. పాలేరుకూ వయసు మీదపడింది. ఎన్నో యేళ్లగా చేస్తున్న ఇల్లు కావటాన పని మానుకోలేక ఇంకా అంటిపెట్టుకున్నాడు.

పాలేరు కొడుక్కి పట్నంలో వుద్యోగం!. కొడుకు వద్దకెళ్లి వుండిపోవాలనేది అతగాడి కోరిక. తండ్రిని తనవద్దకు రావద్దంటాడు కొడుకు! కోడలు గయ్యాళిగంప! అత్తమామలకు కూడు పెట్టటానికి ఏడుస్తుంది. నూటీపోటీ మాటల్తో ఏడిపిస్తూంటుంది.

పదోతరగతి పరీక్ష రిజల్టు వచ్చినయ్. నేనేమో స్కూలు ఫస్టొచ్చాను. పై చదువుకు పొమ్మని హెడ్మాష్టరు సతాయింపు. ఊళ్లో కాలేజీ లేదు. పరాయిచోట హాస్టల్లో వుంటే... మంచంలో వున్న తండ్రిని చూచేవారెవరున్నారు? పనివాళ్ల మీద ఇల్లు వదిలిపెట్టి నేను తండ్రిని దిక్కులేని వాడిని చేయటం ఇష్టంలేదు.

వారమైనా తిరక్కముందే తండ్రి అకస్మాత్తుగ కన్నుమూయటం నెత్తిన పిడుగు పడ్డట్టయింది. అన్నిటికీ వీధిలోవాళ్లు ఇరుగుపొరుగే దిక్కయ్యారు. చేతిలో డబ్బుండబట్టి బాధన్పించలేదు... తండ్రి కూడా నన్ను విడిచి వెళ్లిపోయాడనే దిగులు

తప్పు!

నాన్న పోయిన రెండు మూడు రోజులు అన్నం కూడా సయించలేదు. పక్కింటి ఆంటీ అన్నీతానే అయి ఎంతో సాయం చేసింది. లేకపోతే నేనెన్ని అవస్థలు పడాల్సివచ్చేదో...తండ్రికి కూడా నేనే తలకొరివి పెట్టి... రుణం తీర్చుకున్నాను.

నాకు అన్ని జాగ్రత్తలూ ఆంటీయే చెప్పింది. ఆంటీ ఎంతో మంచి మనిషి! అవసరానికి అదుకునే స్వభావం!. నాకొచ్చిన కష్టాలకు ఆంటీ గనుక పక్కన లేకపోతే నేనేమైపోయేదాన్నో?

నాన్న పోగానే ఒక్క పాడిగేదెను వుంచుకుని మిగతా వాటిని అమ్మేశాను. నా కష్టాల మాట అటుంచితే... గేదె ఆలనా పాలనా నేనే చూసుకోవాలి!. పాల అమ్మకం మానేశాను. నాన్నకు మల్లే తాకట్టువ్యాపారం వద్దనుకున్నాను. నా శక్తికి మించిన పని అన్పించింది!.

ఇనప్పెట్టె తాళాలు భద్రం చేసుకోమని... అందులోని క్యాషంతా బ్యాంకలో ఎకౌంటు ఓపెన్ చేసి అందులోదాచుకోమని... లాకరు తీసుకుని వెండి బంగారం నగలన్నింటినీ లాకర్‌లో పెట్టుకోమని జాగర్తలు నూరిపోసింది ఆంటీ!. ఆంటీ భర్త ఎం.ఆర్వో ఆఫీసులో సూపర్నెంట్. వాళ్లకి పిల్లల్లేరు. నన్నే ప్రేమగ గారాబంగ మొదటి నుండి చూచుకకోవటాన నన్నొదిలి క్షణమైనా వుంటేదు ఆంటీ!. ఆమె నాకు బంధువుకన్నా ఎక్కువ!. నాకు గురువు.... దైవం... అన్నీ ఆంటీనే!

ఇక చదువు ముగిసినట్టే! ఎవ్వరూలేని నాకు ఆంటీనే సర్వస్వం! రేపనేరోజున నాకు తగిన సంబంధం వెతికి పెళ్లి చేసి అత్తవారింటికి పంపాల్సిన బాధ్యత కూడా ఆమెపైనే వుంది.

రోజుకు రెండు లీటర్ల పాలు ధారాళంగ ఇచ్చే బర్రె... సడన్‌గ పాలు ఇవ్వకుండా తన్నటం మొదలుపెట్టింది. ఆంటీని తోడు తీసుకుని గేదెను పశువుల ఆస్పత్రికి తీసుకెళ్లాం.

వైద్యపరీక్ష నిర్వహించిన పశువుల డాక్టరు... ఆ గేదె కడుపులో ప్లాస్టిక్ వుండలున్నాయని ఆపరేషన్ చేసి వాటిని బైటికి తియ్యకపోతే గేదె చనిపోతుందని చెప్పాడు. ఆమాటకి నివ్వెరపోయాం!

గేదెను వీధిలోకి తోలుకెళ్లినపుడు.. త్రోవలో దొరుకే గడ్డితోపాటు వీధిలోకి

విసిరవేయబడిన ప్లాస్టిక్ మెటీరియల్‌ను కూడ తినేసి వుంటుంది. ఇలాంటి కేసులు చాలావస్తున్నాయ్! అందుకే వాడేసిన కవర్లు... ఇతరమైన వాటిని వీధుల్లోకి పడేయకూడదు. వాటిని తినకూడదని గొడ్లకు తెలయదు కాబట్టి తినేస్తయ్. తర్వాత ఇదిగో ఇలాంటి ఇబ్బందులే వస్తయ్!... పరిస్థితిని వివరించాడు వైద్యుడు.

అయిదువేల రూపాయలు ఖర్చుపెట్టి గేదెకి ఆపరేషన్ చేయించి మందులు వాడటం తప్పనిసరైంది.

X X X

తలవని తలంపుగ ఓరోజున మా ఇంటికి ఇద్దరు నడి వయసున్న మగాళ్లు... నలుగురు వృద్ధ వనితలు రావటం చూచి నివ్వెరపోయాను.

వీళ్లు బహుశ తప్పుడు అడ్రసుకొచ్చారేమోనే డౌట్‌తో ఎగదిగా తెల్లమొహం వేసుకు చూస్తూండిపోయాను.

'అట్టా సూత్తావేందే చిట్టీ? మేమంతా మీ సుట్టాలం!. నీ పసితనంలో ఓ సూరొచ్చాం మీ ఇంటికి... ఇదిగో... మళ్లీ ఇదే రావటం...' ఓ ముసలావిడ చేతులు తిప్పుతూ మాట్లాడింది.

'సుట్టాలంటే?-' విస్తుపోయి అడిగాను.

'బందుగులమే! మనమంతా దగ్గరోళ్లం!...'

'నాకు తెలిసి బంధువులెవరూ మాకు లేరే?-'

'అట్టా అనమాక! మీ అయ్య వఠి డబ్బు మడిసి.

ఎవరినీ ఇంటిగడప తొక్కనిచ్చేవాడు కాదు. పైసా సాయం చేసేవాడు కాదు. అందుకే నీ అమ్మఅయ్య బతికినన్నాళ్లూ కట్టమొచ్చినా... సుఖమొచ్చినా మీ ఇంటికి రాలేకపోయాం! నేన్నీకు పిన్నినౌతాను...' మరో ఆవిడ కుండ బద్దలుకొట్టినట్టు మాట్లాడింది. నిజమో అబద్ధమో ఆమె చెప్పింది విన్నాను వచ్చే కోపాన్ని మనసులోనే అణచుకుని.

వచ్చినోళ్లని గడపలోనే వెళ్లిపొమ్మనటానికి మనస్కరించక... చుట్టాలమంటున్నారేసి దొడ్లో నూతి కాడ తానాలు చేసి రమ్మన్నాను.

'బువ్వ నువ్వొండమాకు! ఇంతమందికి నువ్వు వార్చలేవు పసిదానివి... నళ్లోసుకొచ్చి నే వంట సేత్తాలే...' అంది ఇంకొకావిడ.

ఇంతలో పిన్నమ్మ కలలుగజేసుకుని... ఆయన నా పెనిమిటి. నీకు బాబాయి అంటే చిన్నాయనన్నమాట... వాళ్లిద్దరూ నీకు తాతయ్య వరుసవుతారు. మేముండేది సంతమావులూర్లో... నువ్వా బాగా ఎదిగావే! ఏం చదువుకున్నావ్?-' అడిగింది.

'నేను టెన్త్ పాసయ్యాను! ఉండండి మీ అందరికీ పాలుకాచి తెస్తాను...' ఇంట్లోకెళ్లాను.

నాకూ చుట్టాలున్నారన్న విషయం తెల్సుకుని తెగమురిసిపోయాను!

వంటింట్లోకొస్తూ 'చిట్టెమ్మా... మీ ఇంటికి వచ్చినవాళ్లెవరే?' ఆంటీ ప్రశ్నించింది.

'మా చుట్టాలట!'

'నేను నమ్మను. మీకెవరూ చుట్టాల్లేరు. నీకు అమ్మఅయ్యలేరని తెల్సుకిని ఏదో కుట్రచేయటానికి వచ్చివుంటారు వీళ్లంతా!. నువ్వు చిన్నదానివి కాబట్టి నీ ఆస్తి కాజేయటానికి వచ్చిన రాబందులై వుంటారు. నువ్వు జాగర్త! వీళ్లని నమ్మి నోటికొచ్చినట్టు అమాయకంగ వాగమాకు! నీకే డౌటొచ్చినా నాతో చెప్పు. డబ్బు విషయం జాగర్త...' హెచ్చరికలు జారీచేసి తిరిగి వెళ్లిపోయింది. ఆంటీ.

ఇంట్లోవేన్న ఇనప్పెట్టె ఖాళీ కదా! వున్నదంతా క్యాషు నగనట్రా అంతా బ్యాంకులో దాచేసుకున్నాను కదా? ఇంకే భయం లేదు అని మనసుకు నచ్చ చెప్పుకున్నాను. ఎట్లాగూ చుట్టాలమంటూ వచ్చారు కనుక రెండు పూటలు తిని వెళ్తారన్పించింది.

రాత్రి భోజనాలు అయ్యాక అంతా పడుకున్న సమయంలో ఓ ముసలావిడ నావద్దకొచ్చి 'పిల్లా! నీకో నిజం తెలుసా?-' సీరియస్‌గ అంది.

'ఏ నిజం?-' ఆశ్చర్యపోయి అడిగాను ముసలమ్మ ముఖంలోకి చూస్తూ

'నే చెప్తా ఇనుకో! నువ్వు సోమిగాడికి పుట్టిన బిడ్డవు కాదు!- నిన్నెవరో కనిపారేస్తే... చెత్తకుప్పలో పసిగుడ్డుగా అవుపించిన నిన్ను చూచి జాలిపడి... మీ అయ్యకు అమ్మకు పిల్లల్లేకపోవటాన... నిన్ను పెంచి పెద్దచేసారు. అంత మాత్రాన ఆళ్లు నీ కన్నవాళ్లు కారు... నువ్వు వాళ్ల కడుపున పుట్టినదానివి అంతకంటే కాదు. తెల్సిందా? నువ్వొక అనాథవు!- కాబట్టి ఆస్తి మీద నీకు అధికారం లేదు. ఇదంతా వారసులమైన మాకు చెందాలి!- కావాలంటే నువ్వీ ఇల్లుంచుకుని మిగతా డబ్బు నగలు మా పరం చెయ్!. పొలం దస్తావేజులు కూడా ఇచ్చేయాల!. ఇవ్వకపోతే ఈ రాత్రికే నీ పీక పిసికి చంపేస్తాం...' అంటూ బెదిరించింది నన్ను.

నా గుండెల్లో రైళ్లు పరిగెత్తినయ్! భయంతో నా శరీరం కంపించింది.

'ఇకపై నీ ఆటకట్టు! వున్నదంతా నాముందు పెట్టు!-' దబాయించింది ముసలావిడ.

ఇంకా మేలుకునే వాన్నావా? నిద్రపోలేదేం... అంటూ పక్కింటి ఆంటీ వచ్చింది. నా బెదురు చూపులు... నాలోని భయాన్న చూచి రెక్కపట్టుకు వాళ్లింట్లోకి లాక్కెళ్లింది.

నే చెప్పిందతా విని 'నువ్వేం భయపడద్దు అని ఆంటీ అంటూండగానే ముసలావిడ వచ్చి' ఈడకొచ్చి కూర్చున్నావేందే? రా ఇంట్లోకి...' అంటూ నన్ను లాక్కెళ్లింది.

అర్థగంటలో ఇంటికి పోలీసులొచ్చారు. వారి వెంట ఆంటీ అంకుల్ ఇద్దర్నీ చూశాక నాలో ధైర్య వచ్చింది.

'సార్... నే చెప్పానే! చిట్టెమ్మ ఆస్తి కాజేయాలని వచ్చి ఇంట్లో వాలిన రాబందులు... వీళ్లను అరెస్ట్‌చేసి తీసుకెళ్లి లాకప్‌లో పడేసి వీళ్లెవరో నిజాన్ని రాబట్టండి. మా చిట్టెమ్మ కంప్లైంట్ ఇస్తుంది. గడగడా మాట్లాడింది ఆంటీ.

చుట్టాలమంటూ వచ్చిన వారంతా భయంతో వణికిపోయారు.

'వీళ్లంతా కిడ్నాపింగ్ గ్యాంగ్ అన్నమాట!. చుట్టాల రూపంలో వచ్చిన దొంగలు... రాస్కెల్స్... పదండి...' లాఠీలో కొడుతూ అందరినీ జీపెక్కించాడు ఎస్సై.

వారిపై ఫిర్యాదు రాసివ్వటానికి నేనూ ఆంటీ అంకుల్ ముగ్గురం... ఇంటికి తాళం పెట్టి... బయల్దేరాం!

జీపు కదిలింది! స్పీడందుకుంది! నాలో కొండంత ధైర్యం. ఆంటీ యాక్షన్ చూచి ఆమె ధైర్యానికి చలించిపోయాను.

అదేమిటో? నా జీవితంలో అన్నీ అపశృతులే! అనుకుంటూ చెమ్మగిల్లిన కళ్లు తుడుచుకున్నాను. ప్రతిసారీ ఆంటీ నన్ను కాపాడి రక్షిస్తున్నందుకు మనసులో ధన్యవాదాలు తెల్పుకున్నాను.

--- సమాప్తం ---